ఓటరు చేతిలోనే దేశ భవిష్యత్

- 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు పొందాలి
- జాతీయ ఓటరు దినోత్సవంలో అధికారులు
- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఘనంగా వేడుకలు
- అవగాహనసదస్సులు, విద్యార్థుల ర్యాలీలు

నమస్తే నెట్‌వర్క్ : ఓటరు చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని, 18 ఏండ్లు నిండిన యువత ఓటు హక్కు పొందాలని అధికారులు సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో గురువారం ఓటరు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పాత కలెక్టరేట్ నుంచి సమీకృత కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీని అదనపు కలెక్టర్ కే వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఆర్డీవో రమాదేవి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, ప్రజలతో ఓటు హక్కు వినియోగంపై అదనపు కలెక్టర్ ప్రతిజ్ఞ చేపించారు. అత్యధిక సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధులను సన్మానించారు. శాసనసభ ఎన్నికల్లో ఉత్తమ సేవలందించిన బూత్‌లెవల్ అధికారులకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. వ్యాస రచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేశారు. ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఉదయశ్రీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించగా ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, అధ్యాపకులు పాల్గొన్నారు. ఏటూరునాగారంలో తహసీల్దార్ ఖాజామొయినుద్దీన్ ఓటు హక్కు, ఓటు విలువను ప్రజలకు వివరించారు. ఏఎంవో బద్దం సుదర్శన్‌రెడ్డి, కో ఆర్డినేటర్లు సాంబయ్య, రాజు పాల్గొన్నారు. మంగపేట తహసీల్లో తహసీల్దార్ వీరస్వామి సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐలు పాల్గొన్నారు. గోవిందరావుపేట మండల కేంద్రంలో జాతీయ రహదారిపై విద్యార్థులు ర్యాలీ నిర్వహించగా తహసీల్దార్ సృజన్‌కుమార్ ఓటు హక్కుపై వారికి అవగాహన కల్పించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ మమత, ఆర్ఐ సుధాకర్ పాల్గొన్నారు. వాజేడు మండలకేంద్రంలో తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తల్లడి పుష్పలత, ఎంపీడీవో విజయ, ఎంఈవో తేజావత్ వెంకటేశ్వర్‌రావు, నాయబ్ తహసీల్దార్ రాహుల్‌చంద్రవర్మ పాల్గొన్నారు. గణపురం మండల కేంద్రంలో తహసీల్దార్ మురళీధర్‌రావు ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై సాంబమూర్తి పాల్గొన్నారు. చిట్యాల తహసీల్దార్ సుమన్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీగా వచ్చి స్థానిక చౌరస్తాలో మానవహారం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, ఎంఈవో రఘుపతి, ఎంపీవో రామకృష్ణ, ఆర్ఐ రాజు పాల్గొన్నారు. రేగొండ, గోరికొత్తపల్లి మండల కేంద్రాల్లో విద్యార్థులు ర్యాలీ తీశారు. తహసీల్దార్లు సత్యనారాయణస్వామి, రవి ఎంపీడీవో సురేందర్‌గౌడ్, ఎంపీవో రాంప్రసాద్, ఎంపీపీ పున్నం లక్ష్మి పాల్గొన్నారు. మహాముత్తారం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ సందీప్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు. మహదేవపూర్ మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వరకు పలు శాఖల అధికారులు, విద్యార్థులతో కలిసి తహసీల్దార్ లక్ష్మీరాజయ్య ఓటరు అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎండీపీవో రవీంద్రనాథ్, సీడీపీవో రాధిక, ఏపీఎం రవీందర్, డీటీ కృష్ణ, ఆర్ఐ జగన్మోహన్ పాల్గొన్నారు. మల్హార్ మండలం తాడిచెర్ల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో కళాశాల నోడల్ అధికారి నరేందర్ ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ్, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి రవీందర్ పాల్గొన్నారు. కాటారం మండల కేంద్రంలో తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో తహసీల్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం రేషన్ డీలర్లు, రెవెన్యూ సిబ్బంది, ప్రజలతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. వెంకటాపురం (నూగూరు) మండలకేంద్రంలో రెవెన్యూ, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులతో కలిసి తహసీల్దార్ సర్వర్ ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. జడ్పీటీసీ పాయం రమణ, డిప్యూటీ తహసీల్దార్ మహేందర్, ఆర్ఐ మల్లయ్య, ఎంపీటీసీ సీతాదేవి, సర్పంచ్ చిడెం యామిలి, బీఆర్ఎస్ నాయకుడు అచ్చా నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

అసెంబ్లీ స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు రూరల్, జనవరి 25 : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వోల పనితీరు అభినందనీయమని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అదే స్ఫూర్తితో పని చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైందని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ములుగు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అంకిత్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల కమిషన్ పాత్ర కీలకమైందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్న సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ నాగపద్మజ పాల్గొన్నారు.


గోవిందరావుపేట: వృద్ధ దంపతులను సన్మానిస్తున్న తహసీల్దార్

వాజేడు : విద్యార్థుల మానవహారం

గణపురం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భూపాలపల్లి రూరల్ : ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

మహదేవపూర్ : మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఏటూరునాగారం : ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, తహసీల్దార్

అవార్డు అందుకుంటున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

గవర్నర్ నుంచి అవార్డు అందుకున్న భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, జనవరి 25 : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ గురువారం జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రాకు అవార్డును అందజేశారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కాగా, హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జేఎన్ ఆడిటోరియంలో ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ నుంచి కలెక్టర్ అవార్డును అందుకున్నారు.

గంగుల దంపతులకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

కాళేశ్వరంలో మాజీ మంత్రి గంగుల పూజలు

కాళేశ్వరం, జనవరి 25 : శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి మర్యాదపూర్వక స్వాగతం పలుకగా, ముక్తీశ్వరుడికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగుల దంపతులకు అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలతో సన్మానించారు. వారివెంట నాయకులు మోహన్ రెడ్డి, ఓగేశ్ తదితరులున్నారు.

గోదావరికి ప్రత్యేక హారతి

శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అర్చకులు గురువారం గోదావరి మాతకు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక హారతి ఇచ్చారు. నదీ మాతకు చీరె, పూలు, పండ్లు, పాలు సమర్పించి, పంచ, నక్షత్ర తదితర హారతులిచ్చారు.

శిక్షణను వినియోగించుకోవాలి

భూపాలపల్లి రూరల్, జనవరి 25: జ్యూట్ బ్యాగుల శిక్షణను మహిళలు వినియోగించుకోవాలని భూపాలపల్లి సింగరేణి ఏరియా జీఎం బళ్లారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం కృష్ణకాలనీ సేవా భవన్‌లో సెంట్రల్ గవర్నమెంట్ ఎంఎస్ఎంఈ మెక్రో స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజెస్ వారి సౌజన్యంతో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా జీఎం శ్రీనివాసరావు, సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు బళ్లారి మాధవి హాజరై ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం 45 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. 25 మంది బ్యాచ్ చొప్పున శిక్షణ ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏరియా అధికారి ప్రతినిధి అజ్మీరా తుకారాం, డీవై పీఎం శ్యాంప్రసాద్, లేడీస్ క్లబ్ సభ్యురాలు మణి, లక్ష్మి, ప్రవీణ్ పాల్గొన్నారు.

కేజీబీవీకి సౌండ్ సిస్టం అందజేత

టేకుమట్ల, జనవరి 25 : మండలంలోని వెంకట్రావ్‌పల్లి గ్రామానికి చెందిన ప్రముఖ్య వైద్యుడు ఏకు నవీన్ తన తండ్రి, మాజీ సర్పంచ్ మల్లేశ్ జ్ఞాపకార్థం మండలంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయానికి రూ.30 వేల విలువైన సౌండ్ సిస్టంను తల్లి చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

అడవుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

కాటారం, జనవరి 25 : అడవుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు భూపాలపల్లి జిల్లా అటవీ శాఖ అధికారి వసంత అన్నారు. గురువారం ప్రతాపగిరి జీపీలోని ప్లాంటేషన్, గొంతెమ్మ గుట్టను పరిశీలించారు. వన్యప్రాణులు, అడవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆదివాసీ, నాయకపోడ్ సంఘాల నాయకులు లక్ష్మీ దేవర జాతర అభివృద్ధికి సహకరించాలని కోరగా, అడవికి ఎలాంటి హాని కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో వజ్రారెడ్డి, కాటారం ఇన్‌చార్జి రేంజర్ కిరణ్‌కుమార్, ఎఫ్ఎస్‌వోలు అంజయ్య, చంద్రశేఖర్, అర్చన పాల్గొన్నారు.

వన్య ప్రాణులను వేటాడితే చర్యలు

గోవిందరావుపేట, జనవరి 26 : వన్య ప్రాణులను వేటాడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆ విభాగం క్షేత్ర అధికారి శిరీష హెచ్చరించారు. గురువారం పస్రా రేంజ్ పరిధిలోని గొత్తికోయగూడెంలో సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించి వేట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఆమె వెంట సందీప్, నర్సయ్య, శివప్రసాద్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ అర్బన్ యూత్ అధ్యక్షుడికి పరామర్శ

కృష్ణకాలనీ, జనవరి 25 : బీఆర్ఎస్ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు బుర్ర రాజుగౌడ్‌కు తండ్రి కొమురయ్య గుండెపోటుతో గురువారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆస్పత్రికి చేరుకొని కొమురయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతదేహాన్ని 2వ వార్డు ఫక్కీరుగడ్డకు తీసుకురాగా మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ పటేల్, మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్, కౌన్సిలర్లు ఆకుదారి మమత రాయమల్లు, దార పూలమ్మా పోశయ్య, బానోత్ రజితా జుమ్మలాల్, ఎడ్ల మౌనికా శ్రీనివాస్, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్ రెడ్డి నివాళులర్పించి రాజుగౌడ్‌ను పరామర్శించారు.

మొక్క జొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ములుగు రూరల్, జనవరి 25 : ములుగు మండలంలోని లక్నారెడ్డిపల్లి, రామచంద్రాపురం, శివతండా, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లోని వరి, మక్కజొన్న, పెసర పంటలను వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నాగభూషణం, ఆర్ శ్రావణ్‌కుమార్, జీ పద్మజ, స్థానిక ఏవో సంతోష్‌తో కలిసి గురువారం పరిశీలించారు. వరిలో మొగిపురుగు, జింక్ లోపం, తెల్ల చౌడు, అగ్గి తెగులు, మక్కజొన్నలో కత్తెర పురుగు, పెసరలో తామర పురుగు ఉన్నట్లు గుర్తించారు. వీటి నివారణకు స్ప్రే చేయాల్సిన మందులను రైతులకు వివరించారు.

మల్హార్ : మండలంలోని పెద్దతూండ్ల శివారులోని వరి పంటలను స్థానిక ఏవో సుధాకర్ గురువారం పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు మందులను సూచించారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

కృష్ణకాలనీ, జనవరి 25 : నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ నరేశ్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం అంబేద్కర్ సెంటర్ నుంచి జయశంకర్ విగ్రహం వరకు గల ఏరియాలో సుమారు 80మంది పోలీసులతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 48 బైక్‌లు, 40 లీటర్ల మద్యం, 28 లీటర్ల గుడుంబా, నంబర్ ప్లేట్ లేని 40 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంబంధిత వాహనాల యాజమానులు పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లాలని ఏఎస్పీ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు భద్రత కల్పించడంలో రాజీ పడేదిలేదని, అనుమానాస్పద వ్యక్తులు, నేరస్తులు ఆశ్రయం పొందితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ రాములు, చిట్యాల సీఐ వేణుచందర్, భూపాలపల్లి ఎస్సైలు శ్రావణ్, సంధ్యరాణి, శ్రీనివాస్, గణపురం, రేగొండ, మొగుళ్లపల్లి, చిట్యాల, టేకుమట్ల ఎస్సైలు మచ్చ సాంబమూర్తి, రవి కుమార్, మాధవ్, రమేశ్, సుధాకర్, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మేడారం' పనులు సకాలంలో పూర్తి చేయాలి

ఏటూరునాగారం, జనవరి 25 : మేడారం జాతర సందర్భంగా చేస్తున్న పనులు సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సౌకర్యాలు, ఏర్పాట్లపై ఇంజినీరింగ్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విధులకు హాజరయ్యే ఉద్యోగులకు వసతి కల్పించే పాఠశాలల్లో ఫిబ్రవరి 5లోగా మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో ఏర్పాట్లపై ఆరా తీశారు. ఇంచర్ల, తాడ్వాయి ప్రాంతాల్లో నిర్మిస్తున్న కిచెన్, డైనింగ్ హాల్స్ స్థితిగతులపై సమీక్షించారు. 28వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని గిరిజన సంక్షేమశాఖ ఈఈ హేమలతను ఆదేశించారు. జాతరలో చేస్తున్న సివిల్ పనులు ఫిబ్రవరి 1లోగా, మ్యూజియం, ఐటీడీఏ గెస్ట్‌హౌస్ పెయింటింగ్ పనులు 28లోగా పూర్తి చేయాలన్నారు. గుంజేడు, పగిడిద్దరాజు ఆలయాల మరమ్మతు పనులను వచ్చేనెల 2లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి పారుదల ఇంజినీర్లతో సమీక్షించి జంపన్నవాగు వెంట కుళాయిలు ఏర్పాటు చేయాలని, పంపు సెట్లు, మోటర్ల బిగింపు, బావుల్లో పూడిక తీసే పనులపై ఆరా తీశారు. కాన్ఫరెన్స్‌లో ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, డీఎస్పీ రవీందర్, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, గిరిజన సంక్షేమశాఖ ఈఈ హేమలత, ఎండోమెంట్ ఈవో రాజేందర్, ఇరిగేషన్ డీఈఈ సదయ్య, ఎన్పీడీసీఎల్ డీఈఈ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ములుగు డీఈవో బదిలీ

ములుగురూరల్, జనవరి 25: ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి జీ పాణిని బదిలీ అయ్యారు. పదోన్నతిపై ఆయన మంచిర్యాల ఏడీగా నియమితులయ్యారు. హనుమకొండ డీఈవో అబ్దుల్‌హైకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కే లింగయ్య ఉత్తర్వులు జారీ చేశారు.

వైద్యాధికారి పోస్టు భర్తీకి దరఖాస్తులు

ఏటూరునాగారం, జనవరి 25 : ఏజెన్సీ పరిధిలోని మొబైల్ హెల్త్ టీంలో ఖాళీగా ఉన్న వైద్యాధికారి (సివిల్ అసిస్టెంట్ సర్జన్) పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో అంకిత్ తెలిపారు. ఎంబీబీఎస్ పూర్తిచేసి మెడికల్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని, 2024 జూలై 1 నాటికి 44 ఏళ్లలోపు ఉండాలన్నారు. వచ్చేనెల 3లోగా అర్హత సర్టిఫికెట్లను ఐటీడీఏలో అందజేయాలన్నారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- ములుగు, భూపాలపల్లిలో ఏర్పాట్లు పూర్తి

కృష్ణకాలనీ/ ములుగు రూరల్, జనవరి 25 : గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో గురువారం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కృష్ణకాలనీలోని అంబేద్కర్ స్టేడియంలో, ములుగు జిల్లా కేంద్రంలోని బండారుపల్లి రోడ్డులోని తంగేడు మైదానంలో శుక్రవారం కలెక్టర్లు భవేశ్‌మిశ్రా, ఇలా త్రిపాఠి జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. భూపాలపల్లిలో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్ పర్యవేక్షణలో అధికారులు అంబేద్కర్ క్రీడామైదానాన్ని ముస్తాబు చేశారు. వీఐపీలు, వీవీఐపీలు, మీడియా ప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కూర్చోవడానికి ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఆయా శాఖల అధికారుల సమక్షంలో శకటాలను ప్రదర్శించనున్నారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ కిరణ్ ఖారే భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. బండారుపల్లి రోడ్డులోని తంగేడు మైదానంలో చేస్తున్న ఏర్పాట్లను సాయంత్రం ములుగు అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పరిశీలించారు.

కృష్ణకాలనీ : వేదిక వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

ములుగు రూరల్ : ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

వనదేవతలకు భక్తుల మొక్కులు

సమ్మక్కను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, జనవరి 25 : మేడారం సమ్మక్క-సారలమ్మ దర్శనానికి గురువారం భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మొదట జంపన్నవాగులో పుణ్యస్నానం చేసి గద్దెల వద్దకు చేరుకొని పసుపు, కుంకుమ, ఒడిబియ్యం, ఎత్తుబెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో గద్దెలు, మేడారం పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. కాగా, హైదరాబాద్ నుంచి వచ్చిన దాశరథి, శిరీష దంపతుల కూతురు సంధ్య అమ్మవార్ల గద్దెల వద్ద తప్పిపోగా పోలీసులు అప్పగించారు.

రేడియం స్టిక్కర్లు

తాడ్వాయి-మేడారం దారికి ఇరువైపులా ఉన్న చెట్లకు రేడియం స్టీక్కర్లు వేసే పనిని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు గురువారం ప్రారంభించారు. జాతర సందర్భంగా రాత్రి వేళలో వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు డివైడర్లు, చెట్లు, కరెంట్ స్తంభాలకు రేడియం స్టిక్కర్లు వేస్తున్నారు.

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

ములుగు, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలో పనిచేస్తున్న 29మందిని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సాయంత్రం ఉత్తర్వులు వెలువరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వీరికి కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ, తాడ్వాయి తహసీల్దార్ రవీందర్, గోవిందరావుపేట ఎంపీడీవో జే ప్రవీణ్‌తో పాటు వివిధ శాఖల్లోని 26 మంది ఉన్నారు.

కంప్యూటర్, ఫ్యాన్లు బహూకరణ

ఏటూరునాగారం, జనవరి 25 : మండల కేంద్రంలోని నార్త్ ప్రాథమిక పాఠశాలకు హనుమకొండ జిల్లా నడికూడ మండలం రాయపర్తి గ్రామానికి చెందిన రాచర్ల శ్రీకాంత్-మాధవి దంపతులు రూ. 45వేల విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్, మూడు స్టాండ్ ఫ్యాన్లను గురువారం బహూకరించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ ఈసం రామ్మూర్తి, కో ఆర్డినేటర్ సాంబయ్య, హెచ్ఎం సాంబశివరావు, కర్ల అరుణ, లొటపెట్టల రాజేశ్, హిమబిందు, జయమ్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాపర్ వైర్ దొంగల అరెస్టు

మహదేవపూర్, జనవరి 25 : ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ దొంగిలిస్తున్న ఐదుగురు అంతర్‌జిల్లా దొంగలను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు, పట్టుబడిన సామగ్రిని మీడియాకు చూపించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై కే ప్రసాద్‌తో కలిసి కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి వెల్లడించారు. కాటారం మండలం గూడూరు గ్రామానికి చెందిన దుర్గం బాలరాజు, దుర్గం రాజబాపు, జంగేడు గ్రామానికి చెందిన చీమల ప్రవీణ్, అన్నారం గ్రామానికి చెందిన గోమాస దేవరాజు, భూపాలపల్లికి చెందిన రావుల అనిల్ జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ దొంగతనం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు మహదేవపూర్ మండలం బ్రాహ్మణపల్లి, సూరారం, ఎల్కేశ్వరం, మెట్‌పల్లి, కాటారం మండలంలోని మూడు గ్రామాల శివారులోని ట్రాన్స్‌ఫార్మర్లు, గణపురం మండలంలోని రెండు గ్రామాల్లోని ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైర్‌ను దొంగలించి అమ్మారన్నారు. నిందితులను అరెస్టు చేసి రెండు ఆటోలు, ఒక బైక్, నాలుగు సెల్ ఫోన్లు, 58 కిలోల కాపర్ వైర్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వెల్లడించారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కృష్ణకాలనీ, జనవరి 25 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాత ఎర్రచెరువులో నివసిస్తున్న గుడిసె వాసులకు వెంటనే పట్టాలివ్వాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పుచ్చలపల్లి సుందరయ్యనగర్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలోని మోదీ సర్కారుకు వ్యతిరేకంగా వచ్చేనెల 16న దేశ వ్యాప్తంగా చేపట్టే సమ్మెలో కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన కాలనీవాసులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, రాజయ్య, రజినీకాంత్, దేవేందర్, శ్రీకాంత్, ప్రీతి, రమేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా చేరిన రేషన్

బియ్యం అందక లబ్ధిదారుల ఆందోళన

వాజేడు, జనవరి 25 : ప్రతి నెలా 15